


ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ విడుదల

బాసర ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్ విడుదలైంది. ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులకు సువర్ణ అవకాశంగా మారింది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 8లో▸



అడుగంటిన మత్తడి వాగు

మత్తడివాగు ప్రాజెక్టులో నీరు అడుగంటుతోంది. పూర్తి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా మరో 0.5మీటర్ల నీటిమట్టం తగ్గితే డెడ్ స్టోరేజీకి చేరుతుంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
42.0/31.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పడమర దిశగా వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా పరిధిలోని యువతకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకంలో జనరల్ వర్క్, సూపర్ వైజర్, వెల్డింగ్, ఎలక్ట్రీషియన్, పైపు ఫిట్టర్, ప్లంబింగ్, పెయింటింగ్ అండ్ డెకొరేషన్ తదితర కోర్సుల్లో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. భోజనంతోపాటు యూనిఫామ్, శిక్షణ సామగ్రి అందిస్తామని తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు సెల్: 9154548063, 8328507232 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి



రైతులతో మాట్లాడుతున్న బొర్రన్న

ఆదిలాబాద్‌టౌన్: వానకాలం సీజన్‌లో రైతులకు నాణ్యమైన పత్తి, సోయాబీన్ విత్తనాలు అందించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో విత్తనాల డీలర్లను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు మహారాష్ట్ర సరిహద్దున ఉండడంతో నకిలీ విత్తనాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రైతులు నష్టపోయి ఇబ్బందులు పడే అవకాశం ఉందని, రైతులు మోసపోకుండా డీలర్లు చూడాలని కోరారు. రైతులకు అవసరమైన డిమాండ్ విత్తనాలు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. నకిలీ విత్తనాలు తయారు చేస్తున్న వారిపై పీడీయాక్ట్ కేసులు నమోదు చేసి డీలర్ లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొంత మంది డీలర్లు కావాలని పత్తి విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం విత్తన రాయితీ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఆయన వెంట రైతు సంఘాల నాయకులు వెంకట్‌నారాయణ, దేవిదాస్, జగన్, సురేష్ తదితరులు ఉన్నారు.

విలీన కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని విలీన కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేఆర్కే కాలనీలో ఆయన పర్యటిస్తూ కాలనీవాసుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని కాలనీల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కేఆర్కే కాలనీలోని నీటి సమస్య పరిష్కరించేలా మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిక్కాల దత్తు, సాయి, రాము, రేఖ, ముకుంద్, గంగుబాయి, అనిల్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

ఆదిలాబాద్‌టౌన్: రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కేలో బస్తీ దవాఖానాను సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. ఎండాకాలం దృష్ట్యా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు.

విద్యుత్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యుత్ శాఖ అధికారి జేఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యలు, లోవోల్టేజీ, చెట్లు విరిగి వైర్లపై పడితే, ఓవర్ లోడ్ సమస్యలు, తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడడం, ఇతర సమస్యలు ఉంటే సెల్: 9440811700కు సమాచారం అందించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ 24 గంటలపాటు పనిచేస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

అసైన్డ్ భూమి ధారాదత్తం..!



ఈ ఫొటో ముందు భాగంలో ఓ వెంచర్‌లోని లేఅవుట్, అందులోని ప్లాట్లు కనిపిస్తుండగా, వెనుకాల భవన నిర్మాణ పనులు జరుగుతున్నది సమీకృత కలెక్టరేట్‌కు సంబంధించినవి. ఈ రెండింటిని ఎందుకు వివరించాల్సి వచ్చిందంటే.. ఆఫీస్ కార్యాలయాలతోపాటు జిల్లా అధికారులకు సమీపంలోనే నివాస గృహాలు నిర్మించాలని మొదట భావించారు. దానికోసం అదనంగా మరో తొమ్మిదెకరాలు అవసరం కాగా, ఇక్కడ సరిపడా స్థలం లభించలేదు. దీంతో దీనికి కొద్ది దూరంలో నివాస గృహాల నిర్మాణం కోసం ఆ స్థలాన్ని కేటాయించారు. దీంట్లో చోద్యం ఏమిటంటే.. ప్రస్తుతం సమీకృత భవన నిర్మాణానికి వెనుక వైపునకు ఉన్నటువంటిది అసైన్డ్ భూమే. దాంట్లో ప్రస్తుతం లేఅవుట్ చేసి ప్లాట్లు ఏర్పాటు చేశారు. మొదట పూర్తిస్థాయి స్థలం కోసం అన్వేషణ చేసిన అధికారులకు ఈ అసైన్డ్ భూమి కనిపించలేదా.. లేనిపక్షంలో లోపాయికారికంగా ఏదైనా అవగాహన ఉందా.. అన్న ప్రశ్నలు జనాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఆ అసైన్డ్ భూమిని స్వాధీనం చేసుకునే పరిస్థితి ఉన్నప్పటికీ విస్మరించడం చోద్యంగా కనిపిస్తోంది. దీంతోనే మనకు లేదు.. మందికి ధారాదత్తం అన్నట్టుగా జిల్లా యంత్రాంగం తీరు ఉందని పలువురు నవ్వుకునే పరిస్థితి ఉంది.

- కొత్త కలెక్టరేట్ నిర్మాణంలో ఇన్, అవుట్ గేట్ల ఏర్పాటుకు స్థలాభావం
- అధికారుల నివాస గృహాల నిర్మాణానికి మరోచోట స్థలం
- మరోవైపు సమీకృత భవన నిర్మాణానికి వెనకాలే ఎకరాల అసైన్డ్ భూమి పరాధీనం
- కళ్ల ముందే అక్రమ లేఅవుట్, ప్లాట్ల రూపకల్పన
- చోద్యం చూస్తున్న జిల్లా యంత్రాంగం

సాక్షి, ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో న్యూ హౌజింగ్ బోర్డు నుంచి దుబ్బగూడ వెళ్లే దారిలో సర్వే నం.72లో అనేక ఎకరాల భూమి విస్తరించి ఉంది. ఈ సర్వే నంబర్ బై నంబర్లతో విడిపోతూ వచ్చింది. ప్రస్తుతం అనేక బై నంబర్లు ఉన్నాయి. ఇందులోనే సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించారు. నిర్మాణ పనులు ప్రారంభానికి ముందు అప్పట్లో ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ గణపతిరెడ్డి ఈ స్థలాన్ని పరిశీలించారు. మరో రెండున్నర ఎకరాలు ఉంటే సమీకృత భవన నిర్మాణంలో ఇన్, అవుట్ గేట్ల నిర్మాణం సరిగ్గా ఉంటుందని నిర్ధారించారు. దానికి అనుగుణంగా స్థల సేకరణ చేయాలని చెప్పారు. అందుకోసం భూమి సేకరించేందుకు అనువైన పరిస్థితి ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరించారు. జాతీయ రహదారి 44 వైపునకు రెండున్నర ఎకరాల స్థలం అసైన్డ్ భూమే అయినప్పటికీ దాన్ని స్వాధీనం చేసుకోవడంలో విఫలమయ్యారనే విమర్శలు అప్పుడు వ్యక్తమయ్యాయి. అధికారులు ఈ స్థలం కోసం అన్వేషణ చేస్తున్న సమయంలోనే కొంత మంది వ్యక్తులు ప్లాట్లు చేయడమే కాకుండా అక్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్లు చేశారనే అపవాదు వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో ఆ స్థలం విషయంలో రెవెన్యూ అధికారులు చేతులెత్తేశారు.

ఇప్పుడు మరో పదెకరాల అసైన్డ్ భూమి..

సమీకృత భవనంతోపాటు అధికారుల నివాస గృహాల కోసం సమీపంలోనే స్థలం కేటాయించాలని మొదట భావించారు. అందుకు తగ్గట్టుగా స్థలం లేదని చెబుతూ సమీకృత కోసం 17 ఎకరాలు ఒక చోట, నివాస గృహాల కోసం 9 ఎకరాలు మరోచోట గుర్తించారు. ఇప్పుడు సమీకృత భవన నిర్మాణం సాగుతోంది. నివాస గృహాల పనులు ఇంకా మొదలు కాలేదు. సమీకృత వెనకాలే ప్రస్తుతం ఓ పదెకరాల్లో వెంచర్ లేఅవుట్ రూపుదాల్చుకుంది. దాంట్లో ఎన్నో ప్లాట్లకు సంబంధించి రాళ్లు పాతారు. ఈ వెంచర్ గురించి ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే ఈ వెంచర్ స్థలం కూడా అసైన్డ్ భూమే. గతంలో దీనికి సంబంధించి రెవెన్యూ శాఖ నుంచి నిరభ్యంతరణ పత్రం(ఎన్‌ఓసీ) జారీ అయినప్పటికీ ఆ తర్వాత దాన్ని రద్దు చేశారు. అలాంటి పరిస్థితుల్లో ఈ అసైన్డ్ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు పుష్కలమైన అవకాశాలు ఉన్నప్పటికీ ఇక్కడి రెవెన్యూ అధికారులు దాన్ని విస్మరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.

జిల్లాలో కళ్ల ముందే అసైన్డ్ భూములు కబ్జాకు గురవుతున్నాయి. ప్రధానంగా ప్రస్తుతం నిర్మాణం అవుతున్న సమీకృత కలెక్టరేట్ భవనం వెనుకాలే పదెకరాల అసైన్డ్ భూమి అన్యాక్రాంతం అవుతుంది. ఇదిలా ఉంటే జిల్లా కేంద్రంలోనే పలు ఎకరాల్లో అసైన్డ్ భూములు విస్తరించి ఉన్నాయి. వాటికి సమీపంలోనే పట్టా భూములు ఉన్నవారు ఈ అసైన్డ్ భూములను అదే కోవలోకి చూపిస్తూ ఎన్నో ఎకరాల

కళ్లముందే అసైన్డ్ భూములు కబ్జా..

భూములను అన్యాక్రాంతం చేశారనే విమర్శలు ఉన్నాయి. దీనికి స్థానికంగా భూములపై పట్టు ఉన్నటువంటి కొంత మంది రెవెన్యూ అధికారులు వెనకుండి చక్రం తిప్పుతున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇలాంటి భూములను కొంతమంది రాజకీయ నాయకులతో కలిసి కబ్జా చేయడంలో వారి పాత్ర కూడా లేకపోలేదనే అపవాదు ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఈ భూముల విషయంలో దృష్టి సారించాలనే అభిప్రాయం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లాలో 176 మంది నియామకం



పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ సోమవారం పూర్తి చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రక్రియ చేపట్టారు. ఈవీఎంల ఓట్ల కౌంటింగ్ కోసం కౌంటింగ్ సూపర్‌వైజర్లు 36 మంది, కౌంటింగ్ అసిస్టెంట్స్ 36, కౌంటింగ్ మైక్రో అబ్జర్వర్స్ 36 చొప్పున 108 మందిని ఎంపిక చేశారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కోసం సూపర్‌వైజర్లు 17మంది, కౌంటింగ్ అసిస్టెంట్స్ 34, మైక్రో అబ్జర్వర్స్ 17చొప్పున 68మందిని నియమించారు. ఆదిలాబాద్, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈవీఎంల కౌంటింగ్ కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఒక్కో టేబుల్‌కు నలుగురు సూపర్‌వైజర్లు, ఇద్దరు కౌంటింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్లు ఉంటారని పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కోసం 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి 14 టేబుళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్న 2,219 మంది ఉద్యోగుల ఆన్‌లైన్ క్యూ ఆర్ కోడ్ స్కానర్ ద్వారా 13ఏ, 13బీ కవర్లను పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో అరవింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

31నుంచి జొన్న కొనుగోళ్లు బంద్

బేల: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో ఈ నెల 31నుంచి జొన్నల కొనుగోళ్లు నిలిపివేయనున్నట్లు బేల పీఏసీఎస్ సీఈవో తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు జొన్నలు ఉన్నట్లయితే ఈ నెల 30 వరకు సబ్ యార్డుకు తీసుకురావాలని తెలిపారు. రైతులు గమనించి, సహకరించాలని కోరారు.

శాస్త్రీయ పద్ధతిలో పంటలు సాగు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: రైతులు శాస్త్రీయ పద్ధతిలో పంటలు సాగు చేయాలని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే ప్రారంభమై 50 సంవత్సరాల అవుతున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాల్లో పరిజ్ఞానాన్ని అందించి పంట ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వ్యవసాయ పద్ధతులు తెలియజేస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 731 కేవీకేలు ఉన్నాయని, వీటి ద్వారా రైతుల సమస్యలు, సాగు పద్ధతులు, అధునాతన సాగుపై తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, హార్టికల్చర్, పశుసంవర్ధక శాఖ అధికారులు రమేష్, సుధాకర్, కిషన్, అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీధర్ చౌహాన్, శాస్త్రవేత్తలు రాజేందర్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్

వేసవి శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల సందడి వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. సోమవారం స్థానిక వికాసం ప్రత్యేక పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని ఆమె సందర్శించారు. విద్యార్థులకు ఆటపాటలతో కృత్యాధార బోధన చేయాలని, డ్రాయింగ్, పేయింటింగ్ నేర్పించాలని వాలంటీర్లకు సూచించారు. నాణ్యమైన భోజనంతోపాటు ప్రతీరోజు ఉదయం పాలు, బిస్కెట్లు, విరామ సమయంలో పండ్లు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏటీడీవో క్రాంతికుమార్, నీతి అయోగ్ సీపీవో రాహుల్, పీఎంఆర్సీ ఆర్సీఎం గోవింద్‌రావు, వికాసం ప్రిన్సిపాల్ వికాస్, భారత్ దేఖో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థులతో వివరాలు తెలుసుకుంటున్న పీవో

గొర్రెల పంపిణీ ఇక లేనట్లే..!

- రాష్ట్ర ప్రభుత్వం మంగళం..?
- గొల్లకుర్మలకు డీడీలు వాపస్
- ఇప్పటికే 1200 మందికి ఇచ్చిన అధికారులు

బోథ్: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే రాష్ట్రస్థాయిలో పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో గొర్రెల పంపిణీకి సంబంధించిన ఫైళ్లు మాయం కావడం సంచలనంగా మారింది. గత ప్రభుత్వంలో పలువురు అధికారుల అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆగిపోయిన రెండో విడత గొర్రెల పంపిణీని తిరిగి ప్రారంభిస్తుందని గొల్లకుర్మలు ఆశించారు. రెండో విడతకు సంబంధించిన డీడీ డబ్బులు ప్రభుత్వం వాపస్ ఇస్తుండడంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. ఆలస్యమైనా గొర్రెలు చేతికి వస్తాయనుకుంటే డీడీలు ఇచేస్తుండడంతో ఈ నిలిపి వేసినట్లేనని చర్చ మొదలైంది. కొంతమంది డీడీలు వాపస్ ఇవ్వాలని కోరుతుండగా, మరికొందరు గొర్రెల యూనిట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లాలో డీడీలు వాపస్..

మొదటి విడత గొర్రెల పంపిణీలో భాగంగా లబ్ధిదారులకు ఒక్కో యూనిట్‌లో 20 గొర్రెల తోపాటు ఒక పొట్టేలు అందజేశారు. ఒక్కో యూనిట్ విలువ రూ.1.58 లక్షలు, ఇందులో ప్రభుత్వ రాయితీ పోగా లబ్ధిదారుడు రూ.43,750 చెల్లించారు. రెండో యూనిట్ విలువను రూ.1.75 లక్షల వరకు పెంచారు. జిల్లాలో 8,660 యూనిట్లు ఉండగా, మొదటి విడతలో 5022 మందికి యూనిట్లు అందజేశారు. రెండో విడతలో 567 మందికి అందించారు. జిల్లాలో మరో 1,774 మందికి యూనిట్లు అందించాల్సి ఉంది. పలువురు తమ డీడీలు చెల్లించాలని లేదా యూనిట్లు అందించాలని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గొల్లకుర్మలు గొర్ల యూనిట్ల కోసం కట్టిన డీడీలను అధికారులు తిరిగి అందజేస్తున్నారు. తాము కట్టిన డీడీలకు గొర్ల యూనిట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో పలువురు డీడీలు వాపస్ తీసుకుంటున్నారు. ఇప్పటివరకు 1200 మందికి డీడీలను పశుసంవర్ధక శాఖ అధికారులు ఇచ్చేశారు. జిల్లా వ్యాప్తంగా మరో 574 మందికి డీడీలు అందించాల్సి ఉంది.



యూనిట్లు ఇస్తే మంచిది



గొర్రెలు ఇస్తేనే మంచిది. గత మూడేళ్ల క్రితం రూ.43,750 డీడీలు కట్టినం. ఇప్పటి వరకు గొర్రెలు రాలేదు. గొర్రెలు ఇస్తేనే గొల్లకుర్మల సంపద పెరుగుతుంది. అప్పు చేసి డీడీలు చెల్లించాం. ఇప్పుడు తిరిగి ఇస్తామంటున్నారు. డీడీలు కట్టిన వారికి ప్రభుత్వం గొర్రెల యూనిట్లు అందించాలి. ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంతోనే చాలా మంది డీడీలు వెనక్కి తీసుకుంటున్నారు. ఈ పథకాన్ని ఇలానే కొనసాగించాలి.

– గొర్ల విజయ్, బోథ్

వడ్డీ బకాయిలు విడుదల

- రూ.2.82 కోట్లు ఖాతాల్లో జమ
- 3282 మహిళా సంఘాలకు ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న సభ్యులు
- పెండింగ్‌లో రూ.13.24 కోట్లు

కైలాస్‌నగర్: మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తోంది. వాటిని సద్వినియోగం చేసుకుని ఎంతోమంది అతివలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ముందడుగు వేస్తున్నారు. బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించిన సంఘాలకు ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తూ వారి ఖాతాల్లో జమ చేస్తోంది. గత కొన్నేళ్లుగా ఈ వడ్డీలేని రుణం అందకపోవడంతో సకాలంలో పొదుపు చెల్లించిన సంఘాల సభ్యులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందించాలని నిర్ణయించింది. మహిళలు ఆర్థికంగా మరింత పురోగతి సాధించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని పునరుద్ధరించిన ప్రభుత్వం గత నాలుగు నెలల వడ్డీ బకాయిలు విడుదల చేసింది. జిల్లాలోని 3,282 సంఘాలకు రూ.2.82 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేస్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయం ఆర్థికంగా అవస్థలు పడుతున్న మహిళల్లో ఆనందాన్ని నింపుతోంది.



సమావేశంలో పాల్గొన్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు (ఫైల్)

స్వయం ఉపాధికి భరోసా

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో 7,532 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఇందులో 1,16,492 మంది సభ్యులు ఉన్నారు. వీరు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద బ్యాంకుల ద్వారా స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేస్తోంది. స్వయం సమృద్ధి సాధించేందుకు తోడ్పడుతోంది. ఈ రుణాలు సకాలంలో వడ్డీతోపాటు చెల్లించిన మహిళా సంఘాలకు ప్రభుత్వం తిరిగి వారి ఖాతాల్లో వడ్డీ జమ చేస్తోంది. అలా వచ్చిన సొమ్ముతో కలిపి బ్యాంకుల్లో ఉన్న రుణాన్ని తగ్గిస్తారు. తద్వారా మహిళా సంఘాలపై వడ్డీ భారం పడకుండా ఉంటుంది. ఆరు నెలలకోసారి విడుదల చేయాల్సిన వడ్డీని ప్రభుత్వం గత మూడేళ్లుగా నిలిపివేసింది. దీంతో సకాలంలో రుణాలు చెల్లించిన సంఘ సభ్యులు వాటి కోసం నిరీక్షించాల్సి వచ్చింది. ఆర్థికంగాను తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. చివరి సారిగా గతేడాది ఫిబ్రవరిలో రూ.4.71 కోట్ల వడ్డీ విడుదల చేసింది. తాజాగా మరో రూ.2.82 కోట్లు విడుదల చేసింది.

నాలుగు నెలల బకాయిలే విడుదల

జిల్లాలో 2021–22 సంవత్సరానికి గాను 7,361 సంఘాలకు రూ.449.8లక్షల వడ్డీలేని రుణాలు విడుదల కావాల్సి ఉండగా, 2022–23 సంవత్సరానికి గాను 8,340 సంఘాలకు సంబంధించి రూ.878.88లక్షలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల నేపథ్యంలో రూ.4.71 కోట్లు గతేడాది విడుదల చేసింది. మిగతా వాటిని త్వరలోనే విడుదల చేస్తామని ప్రకటించింది. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి సున్న వడ్డీ రుణాలు అందించాలని ప్రకటించింది. మహిళా సంఘాల సభ్యులతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి త్వరితగతిన ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చి అతివలకు అండగా నిలుస్తామని ప్రకటించారు. పాత బకాయిల జోలికి వెళ్లకుండా గతేడాది డిసెంబర్ నుంచి ఈ యేడాది మార్చి వరకు ఉన్నటువంటి నాలుగు నెలల బకాయిలు మాత్రమే విడుదల చేసింది. జిల్లాలోని 3,282 సంఘాలకు రూ.2.82 కోట్లు సంబంధిత మహిళల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇక నుంచి రెగ్యులర్‌గా వాటిని అందించనున్నట్లుగా స్పష్టం చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు పాత బకాయిలను సైతం త్వరితగతిన విడుదల చేస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

జిల్లాకు మంజూరైన వడ్డీ బకాయిలు, సంఘాల వివరాలు..

మండలం	మొత్తం గ్రూపులు	రూ.లక్షల్లో
ఆదిలాబాద్‌రూరల్	256	18.49
బజార్‌హత్నూర్	313	17.90
బేల	221	11.49
భీంపూర్	183	09.28
బోథ్	577	44.64
గాదిగూడ	100	14.34
గుడిహత్నూర్	195	13.36
ఇచ్చోడ	290	20.90
ఇంద్రవెల్లి	365	11.78
జైనథ్	283	18.34
మావల	65	45.68
నార్నూర్	229	10.89
నేరడిగొండ	317	20.54
సిరికొండ	143	09.17
తలమడుగు	268	19.45
తాంసి	173	11.24
ఉట్నూర్	618	45.17

క్లుప్తంగా

సుధీర్‌కు తారకరామారావు అవార్డు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణానికి చెందిన న్యాయవాది సంగెపు సుధీర్ కుమార్ నందమూరి తారకరామారావు అవార్డు ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో అవార్డు అందుకోనున్నట్లు ఆయన తెలిపారు.కార్యక్రమంలో తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్, సత్య సంగీత అధ్యక్షుడు ఓంకార్ రాజు, సినీ ప్రముఖులు హాజరవుతారని పేర్కొన్నారు.

అనుమానాస్పదంగా చుక్కల దుప్పి మృతి


చుక్కల దుప్పి కళేబరం

నర్సాపూర్(జి): మండలంలోని బామ్ని (బి) అటవీ ప్రాంతశివారు చెరువులోని నీటిని తాగేందుకు వచ్చిన చుక్కల దుప్పి(మచ్చల జింక) అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నర్సాపూర్ (జి) గ్రామానికి చెందిన పలువురు యువకులు సోమవారం గమనించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. దుప్పి మృతి చెందిన తీరు చూస్తే హత మార్చారా? లేక పరిగెత్తినప్పుడు చెట్టు కొమ్మ తగిలి మృతి చెందిందా..అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దుప్పి ముఖ భాగంలో గాయమైనట్లు కనబడుతోంది. అటవీ అధికారులు వెళ్లి పరిశీలించగా మృతి చెందిన చుక్కల దుప్పి చెట్ల పొదల్లోకి లాక్కెళ్లి తిన్నట్టు ఆనవాళ్లు ఉన్నాయి. పంచనామా తర్వాత అసలు విషయం తెలుస్తుందని ఫారెస్ట్ అధికారులు తెలపడం గమనార్హం.

విద్యుత్ తీగలు తగిలి ఆవు మృతి


ఆవు కళేబరం

బోథ్: మండలంలోని చింగతూడలో విద్యుత్ తీగలు తగిలి ఆవు మృతిచెందింది. ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు వీయడంతో చేనులో 11 కేవీ విద్యుత్ వైర్లు కిందపడ్డా యి. అక్కడే ఉన్న ఆవుకు వైర్లు తగలి అక్కడికక్కడే మృతి చెందింది. తనకు పరిహారం అందించాలని బాధిత గొడం లక్ష్మణ్ కోరాడు.

ట్రిపుల్‌ఐటీ నోటిఫికేషన్ విడుదల

- ఇంటిగ్రేటెడ్ విద్యపై విద్యార్థుల చూపు
- ఆరేళ్ల సాంకేతిక విద్యతో అద్భుతాలు
- ఏటా వందలాది మందికి ఉద్యోగాలు
- రాష్ట్రవ్యాప్తంగా సీట్ల కోసం పోటీ

భైంసా(ముధోల్): ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్‌ఐటీలో నూతన విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి వర్సిటీ అధికారులు సోమవారం ఆన్‌లైన్‌లో నోటిఫికేషన్ విడుదల చేశారు. జూన్ 1 నుంచి 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. www.rgukt.ac.in వెబ్‌సైట్‌లో, ఈమెయిల్ ద్వారా admissions@rgukt. ac. in సందర్శించాలని సూచించారు. ఆరేళ్ల సమీకృత(ఇంటిగ్రేటెడ్) ఇంజనీరింగ్ కోర్సు కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు టీజీ ఆన్‌లైన్, మీసేవ, యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్షలు ముగిసి ఫలితాలు కూడా వచ్చేశాయి. ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులంతా కోర్సుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ కాలేజీలో చదివించాలో.. ఏ కోర్సులు చేయించాలో.. అనే విషయంపై విద్యావేత్తల సలహాలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా విద్యార్థుల చదువులపైనే ప్రత్యేక చర్చ కొనసాగుతోంది. తెలంగాణలోనే ఏకైక విద్యాలయ ప్రాంగణాన్ని కలిగి ఉన్న బాసర ట్రిపుల్‌ఐటీ నోటిఫికేషన్ విడుదల కావడంతో ఇక్కడ దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. చాలామంది తల్లిదండ్రులూ తమ పిల్లలను ఇక్కడే చదివించాలనుకుంటున్నారు.



గ్రామీణ విద్యార్థులకు వరం..

గ్రామీణ విద్యార్థులకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించే బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు పోటీపడుతుంటారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పల్లె విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీ సువర్ణ అవకాశంగా మారింది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుకు సంబంధించి బాసర ట్రిపుల్‌ఐటీలో ఏటా పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించి అందులో అర్హత ఉన్నవారిని ఎంపిక చేసి సీట్లను కేటాయిస్తుంది. మూడేళ్లక్రితం ప్రవేశాలకు సంబంధించి మొదటిసారిగా పాలిసెట్ అర్హతను జోడించి సీట్లను కేటాయించారు. అప్పట్లో కోవిడ్ నేపథ్యంలో పాఠశాలలు మూసి ఉండడంతో పదో తరగతి విద్యార్థులను పరీక్షలు లేకుండానే ఉత్తీర్ణులు చేశారు. అలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల సీట్ల కేటాయింపు ప్రక్రియలో పాలిసెట్ అర్హతను జోడించి సీట్లు కేటాయించారు. ఈ యేడు పాత విధానంలో సీట్లు భర్తీ చేయనున్నారు.

వేల సంఖ్యలో దరఖాస్తులు..

బాసర ట్రిబుల్ ఐటీలో దరఖాస్తు చేసుకునే విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. 2020–21లో 32వేల మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా 2021–22లో 20,178 మంది, 2022–23లో 31,432 మంది, 2023–24లో 32,635 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

ఏటా భారీగా దరఖాస్తులు

బాసర ట్రిపుల్‌ఐటీలో చదివేందుకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఆసక్తి కనబరుస్తారు. నోటిఫికేషన్ ప్రక్రియ వెలువడడంతోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తాం. ఇక్కడ సీటు దక్కించుకునేందుకు ఏటా 30 వేలకు పైగానే విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇక్కడ చదివేందుకు పోటీ పడుతున్నారు.– **వెంకటరమణ, ఇన్‌చార్జి వీసీ**

సమీకృత విద్యావిధానం...

ట్రిపుల్‌ఐటీలో ఆరేళ్లపాటు ఇంటర్‌తో పాటు సమీకృత ఇంజనీరింగ్ విద్య కొనసాగుతోంది. మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ కోర్సు నేర్పిస్తారు. అనంతరం అందులో మెరిట్ ఆధారంగా మరో నాలుగేళ్ల ఇంజనీరింగ్ సీట్లను ఎంపిక చేసుకోవచ్చు. పీయూసీ విద్య అనంతరం మెరుగైన అవకాశాలు వస్తే విద్యార్థులు ఇక్కడి నుంచి బయటకు వెళ్లి చదువుకునే అవకాశం కూడా ఉంది. నాలుగేళ్ల బీటెక్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈసీఈ, ఎంఎంఈ కోర్సులు అందిస్తున్నారు. మొదటి రెండేళ్ల పీయూసీలో సాధించిన మార్కుల ఆధారంగానే బీటెక్‌లో కోర్సులు కేటాయిస్తారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీ అధికారులు అన్ని వసతులను సమకూరుస్తారు. ల్యాప్‌టాప్, అందరికీ ఒకే రకమైన దుస్తులు, షూస్, స్పోర్ట్స్ డ్రెస్ అందిస్తారు. హాస్టల్, భోజన వసతి యూనివర్సిటీయే కల్పిస్తుంది. చదివే విద్యార్థుల కోసం శారీరక, మానసిక వికాసానికి ఆటలు, వ్యాయామం, సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకు సైతం తరగతులు నిర్వహిస్తున్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రత్యేక వైద్యశాల, అధునాతనమైన ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీ అందుబాటులో ఉన్నాయి.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తోటి, కొలాం, కోలావర్ తెగలకు చెందిన గిరిజన విద్యార్థుల నుంచి గురుకుల పీవీటీజీ ప్రతిభ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 30న ఉదయం 10గంటలకు గిరిజన గురుకుల జూనియర్ కళాశాల(బాలికలు) ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. కౌన్సెలింగ్‌కు వచ్చే విద్యార్థులు మెమో, బోనాఫైడ్, టీసీ, కుల, ఆదాయ, ఫిజికల్‌ఫిట్నెస్, ఆధార్, నిజధ్రువీకరణ పత్రాలు, రెండు జతల జిరాక్స్, పాస్‌ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

తైక్వాండో పోటీల్లో జిల్లావాసి ప్రతిభ


ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న అక్షయ్

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లో ఈనెల 26న నిర్వహించిన తెలంగాణ స్టేట్ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ అండర్–30లో జిల్లా కేంద్రానికి చెందిన ధ్యాయత్ అక్షయ్ ప్రతిభ కనబర్చారు. తృతీయ స్థానంలో నిలిచిన ఆయనకు రాష్ట్ర తైక్వాండో సెక్రెటరీ చేతుల మీదుగా మెడల్ స్వీకరించారు. ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అక్షయ్‌ని గురువు నాగరాజును పలువురు అభినందించారు.

భగీరథకు నీటిగండం



పొక్లెయిన్ సహాయంతో కాలువ తీస్తున్న సిబ్బంది

- కడెం ప్రాజెక్ట్‌లో తగ్గిన నీటిమట్టం
- ఇంటెక్‌వెల్‌కు నీరందక ఇబ్బందులు

కడెం: కడెం ప్రాజెక్ట్‌లో నీటిమట్టం క్రమంగా తగ్గిపోవడంతో..మిషన్ భగీరథకు ఇబ్బందులు పొంచి ఉన్నాయి. గతంలో ఎప్పుడు లేనివిధంగా ప్రాజెక్ట్‌లో నీటిమట్టం పూర్తిగా తగ్గడంతో భగీరథ ఇంటెక్ వెల్‌కు నీరందడం లేదు. దీంతో అధికారులు ఇంటెక్‌వెల్‌కు నీరందేలా పొక్లెన్ సహాయంతో కాలువ తీయిస్తున్నారు. బురద నీటిలో పొక్లెన్ వెళ్లేందుకు వీలు లేకపోవడంతో కూలీలతో బురదను తొలగింపజేస్తున్నారు. అయితే కాలువ తీసినకొద్దీ నీరు తగ్గిపోవడంతో రానున్న రోజుల్లో భగీరథకు ఇబ్బందులు తప్పేలా లేవు.

మండలాలకు నీటి సరఫరా

కడెం మిషన్ భగీరథ యూనిట్ నుంచి కడెం, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్, జన్నారం మండలాలకు మిషన్ భగీరథ నల్లా నీరందుతుంది. ఐదు మండలాల్లోని ఆయా గ్రామాల్లో ని సుమారు 30 వేల నల్లా కనెక్షన్‌లు ఉన్నాయి.


కడెం ప్రాజెక్ట్‌లో భగీరథ ఇంటెక్‌వెల్

కాలువ తీయిస్తున్నాం

ప్రాజెక్ట్‌లోని రోజురోజుకు నీటిమట్టం తగ్గడంతో ఇంటెక్‌వెల్‌కు కాలువకు నీరందడం లేదు. పొక్లెన్, కూలీల సహాయంతో కాలువ తీయిస్తున్నాం. నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– **వెంకటరమణ, డీఈ**

వేసవి దుక్కులు పంటకు మేలు

- లోతు దుక్కులతో చీడపీడల నివారణ
- వర్షం నీరు లోతుకు చేరుతుంది
- తెగుళ్ల నివారణకు అవకాశం

నిర్మల్‌చైన్‌గేట్: వేసవి దుక్కులు పంటలకు మేలు చేస్తాయి. నాగళ్ల సాళ్లతో భూమి వదులుగా మారి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. చీడపీడల ప్రభావం తగ్గి పంట దిగుబడి పెరుగుతుంది. జిల్లాలో కొన్నిరోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు వేసవి దుక్కులు దున్నుతున్నారు. పొలాల్లో మిగిలిన వ్యర్థాలను కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారడంతోపాటు మట్టిని పెకిలించడం ద్వారా భూమిలో గాలిశాతం పెరుగుతుంది.

లోతుగా దున్నుకోవాలి

పొలాలు చదును చేసుకుని, తొలకరి ముందే విత్తుకోవడానికి సిద్ధం చేసుకోవాలి. పంటల కోతల అనంతరం భూమిని వృథాగా వదిలేయకుండా లోతుగా దుక్కి దున్నితే పంటలను ఆశించే చీడపురుగులు నివారించవచ్చు. అంతేకాకుండా వర్షాలు కురిస్తే నీరు భూమి లోపలి వరకు చేరుతుంది. మొదటిసారి దుక్కి దున్నిన తర్వాత రెండోసారి దున్నే ముందు పశువుల ఎరువు, వర్మీ కంపోస్టు లేదా చెరువు మట్టిని పొలంలో వెదజల్లడం ద్వారా మంచి దిగుబడి వస్తుంది.

మూడు రకాల దుక్కులు..

వేసవి దుక్కులను లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలి. వాలుకు అడ్డంగా దున్నుకోవడం వల్ల వర్షపు నీరు భూమిలో ఇంకేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి ఎక్కువ తేమను గ్రహిస్తుంది. నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వేసవి దుక్కులకు ముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడం వల్ల వాటి విసర్జక వ్యర్థాలు సేంద్రియ ఎరువుగా మారి భూమిలోకి చేరుతాయి. అవి భూసారవృద్ధికి తోడ్పడుతాయి.



పత్తి, వరి మొదళ్లను భూమిలో కలపాలి

ఏటా పత్తి దిగుబడి అనంతరం రైతులు పత్తి కట్టెను కోసి తగులబెడుతుంటారు. అలా కాకుండా భూమిలో తేమ ఉన్నప్పుడు రోటోవేటర్‌తో కలియదున్నాలి. ఇలా చేయడం వల్ల భూమి సారవంతం పెరగడమే కాకుండా రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించవచ్చు. వరి పంట కోసిన తర్వాత వరి మొదళ్లను భూమిలో కలిపి దున్నాలి.

సేంద్రియ ఎరువుల వాడకం..

సేంద్రియ ఎరువులు నేల లోపలకు వెళ్లి ఖనిజ పొరల్లో అభివృద్ధి చెంది పంటకు స్థూల, సూక్ష్మపోషకాలు అందిస్తాయి. నేల రసాయనిక, భౌతిక, జీవ గుణాలపై ప్రభావం చూపి నేల సత్తువ, ఉత్పాదక శక్తిని పెంచుతాయి. పశువుల ఎరువులు, కోళ్లు, గొర్రెలు, మేకల, వానపాముల ఎరువులను ఎకరాకు సుమారు 2–4 టన్నుల వరకు వాడవచ్చు. విత్తడానికి 20–25 రోజుల ముందే సేంద్రియ పదార్థం వాడటం వల్ల భూమి గట్టి పడకుండా వదులుగా ఉంటుంది. నీరు బాగా ఇంకడం వల్ల తేమశాతం పెరిగి విత్తనం బాగా మొలకెత్తుతుంది.

విత్తన ఎంపిక ప్రధానం..

సాగులో విత్తనాల ఎంపిక ప్రధానం. పలు రకాల కంపెనీల విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆయా కంపెనీల డీలర్లు రైతులను ఆకట్టుకునేలా ప్రచారం చేస్తున్నారు. దీంతో ఏ కంపెనీ నాణ్యమైన విత్తనాలను అందిస్తుందనే విషయంలో రైతులకు అవగాహన లేకుండా పోతోంది. ఏటా ఏదో ఒక కంపెనీ విత్తనాలను వేసుకునేకంటే నాణ్యమైనవి వేయాలి.

వరి కొయ్యలు కాల్చొద్దు

వరి కొయ్యలను పొలంలో కలియదున్నితేనే పంటకు మేలు. పంట దిగుబడి పెరుగుతుంది. వరి కొయ్యలను కాల్చితే భూసారం తగ్గడంతోపాటు పంట దిగుబడి తగ్గే ప్రమాదముంది. పొలాలను వేసవిలో దున్నుకోవాలి. నేలలో ఉన్న పురుగులు చనిపోతాయి. రైతులు జీలుగ విత్తనాలు వేస్తే భూములు సారవంతమవుతాయి.

– **నాగరాజు, ఏవో**

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రవీణ్‌గౌడ్(ఫైల్)

మామడ: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి..మండలంలోని దిమ్మదుర్తి గ్రామానికి చెందిన అల్లకొండ ప్రవీణ్‌గౌడ్(30) తన మిత్రుడు శేఖర్‌గౌడ్‌తో కలిసి బైక్‌పై నిర్మల్‌కు వెళ్లి పని ముగించుకుని స్వగ్రామానికి వస్తున్నాడు. సోమవారం ఖానాపూర్ నుంచి బొలెరో వాహనం నిర్మల్‌కు వెళ్తుండగా మామడ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. బైక్ నడుపుతున్న ప్రవీణ్‌గౌడ్ తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శేఖర్‌గౌడ్ కాలి గాయమైంది. ఎస్సై సందీప్ ఘటన స్థలాన్ని సందర్శించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తెల్లారితే గల్ఫ్‌కు వెళ్లేవాడు..

ప్రవీణ్‌గౌడ్‌ది పేద కుటుంబం. చిన్నవయసులో తండ్రి మృతి చెందాడు. ఆయన తోపాటు తమ్ముడు, చెల్లిని తల్లి పెంచి పోషించింది. కుటుంబ పోషణ నిమిత్తం ప్రవీణ్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆయనకు ఇటీవల పెళ్లి జరిగింది. తల్లి అనారోగ్యంతో బాధపడుతుంది. గల్ఫ్ నుంచి నాలుగు నెలలకోసారి స్వగ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. ఈక్రమంలో 15 రోజుల క్రితం రాగా, మంగళవారం అక్కడికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. జిల్లా కేంద్రంలో పనిచేసుకుని తిరిగి మామడ వరకు చేరుకున్నారు. మరో 3 కి.మీ ప్రయాణిస్తే ఇంటికి చేరుకునేవాడు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబలించింది. ఆయన మృతితో కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది.

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఆదిలాబాద్‌టౌన్: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే పోలీసు ఇన్‌చార్జి భోజన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సోమవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఉండం–ఆదిలాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 40 ఏళ్లు ఉంటుందని, ఆయన కుడిచేతిపై పచ్చబొట్టు ఉందని, శరీరంపై నల్లని గీతల ఫుల్ షర్టు, యాష్ రంగు ప్యాంట్ ఉందని అన్నారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. సంబంధీకులు ఎవరైన ఉంటే సెల్: 9440442722పై సమాచారం అందించాలని సూచించారు.

పురుగుల మందుతాగి యువతి

ఆసిఫాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఆసిఫాబాద్ మండలం ఇప్పల్ నవెగాం గ్రామానికి చెందిన సుష్మ (16)ని తల్లిదండ్రులు సోమవారం వ్యవసాయ పనులకు రమ్మనడంతో వెళ్లలేదు. తండ్రి అర్జున్ మందలించడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. కుటుంబీకులు గమనించి జిల్లాస్పత్రికి, మంచిర్యాలకు రెఫర్ చేశారు. చికిత్సపొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి..

మందమర్రిరూరల్: పట్టణంలోని మూడవ జోన్‌కు చెందిన మేకల రవి (47) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై మజీద్‌ఖాన్ కథనం ప్రకారం..కూలీ చేసుకునే రవి తాగుడుకు బానిసయ్యాడు. తరచూ డబ్బుల కోసం భార్యను వేధించసాగాడు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో భార్యతో గొడవకు దిగాడు. మద్యం మత్తులో గడ్డి మందు తాగగా కుటుంబీకులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఎండదెబ్బతో యాచకుడి మృతి

వాంకిడి: ఎండదెబ్బ తగిలి ఓ వృద్ధ యాచకుడు మృతి చెందినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మహారాష్ట్రలోని దేవాడ గ్రామానికి చెందిన గేడం కుర్కుడె శ్రీ గణేశ్(75) ప్రతీ రోజు భిక్షాటన చేసుకుని జీవనం గడిపేవాడు. సోమవారం ఉదయం మండల కేంద్రంలోని మహారాష్ట్ర బస్సులు ఆగే బస్టాండ్‌లో శ్రీ గణేశ్ పడి ఉండటాన్ని తమ్ముడి కుమారుడు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. శ్రీ గణేశ్ కుమారుడు గేడం సచిన్ అక్కడికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. ఎండ దెబ్బ తగిలి చనిపోయి ఉంటాడని మృతుడి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సచిన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

బెల్లంపల్లి: కుటుంబ, ఆర్థికసమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై రమేశ్ కథనం ప్రకారం..కరీంనగర్‌లో నివాసం ఉంటున్న జడ్డపాటి జానయ్య అలియాస్ జాన్ (38) ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అంతకు ముందు జాన్ బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి గంగారాంనగర్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. కొన్ని నెలల క్రితం కరీంనగర్‌కు వలస వెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత తన భార్యతో నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. భార్య తిర్యాణిలోని తన పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపం చెందిన జాన్ బెల్లంపల్లిలోని ఇంట్లో రాత్రి గుర్తు తెలియని మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి

- రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: నర్సుల సేవలు వెలకట్టలేనివని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. సోమవారం రిమ్స్ ఆస్పత్రిలో నర్సింగ్ డేను ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ వైద్యుడు రోగికి వైద్యం చేస్తే నర్సులు దగ్గరుండి మిగతా సేవలందిస్తారని కొనియాడారు. వారు కోలుకునే వరకు వైద్యం అందిస్తారని పేర్కొన్నారు. బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి ఆదర్శంగా నిలువాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ వనజ, స్టాఫ్‌నర్సులు తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న నర్సింగ్ సూపరింటెండెంట్ వనజ

పెన్‌గంగ నదికి నైవేద్యాలు


నదిలో నైవేద్యం సమర్పిస్తున్న రైతు కుటుంబం

తాంసి: భీంపూర్ మండలంలోని తాంసి(కె), వడూర్, అంతర్గాం, గొల్లఘాట్ గ్రామాల సరిహద్దు గుండా ప్రవహిస్తున్న పెన్‌గంగ నదికి రైతు కుటుంబీకులు, భక్తులు సోమవారం పూజలు నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో నదికి నైవేద్యాలు సమర్పించారు. దీపాలు వెలిగించి తెప్పలపై ఉంచి నదిలో వదిలారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, సకాలంలో వర్షాలు కురవాలని గంగాదేవిని వేడుకున్నారు. అనంతరం నది నీటిని తీసుకెళ్లి రైతులు వారి చేన్లలో చల్లుకున్నారు. ఏటా ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో నదికి నైవేద్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.